సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
శనివారం, 12, అక్టోబర్, 2024



టమాట కిలో రూ.50

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్టంగా రూ.50, కనిష్టంగా రూ.30 ప్రకారం ధర పలికింది.



పెయ్య దూడలతో ఆర్థికాభివృద్ధి

జిల్లాలో పాడి రైతుల ఆర్థికాభివృద్ధికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకున్న చర్యలు సత్ఫలితాలను ఇస్తోంది.

6లో

గరిష్టం/కనిష్టం
35.4°/22.6°

జిల్లా పరిధిలో శుక్రవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉక్కపోత పెరిగింది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. గంటకు 6 నుంచి 10 కి.మీ వేగంతో ఆగ్నేయం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

ప్రజలందరికీ దసరా శుభాకాంక్షలు




కలెక్టర్ టీఎస్ చేతన్ ఎస్పీ రత్న

పుట్టపర్తి టౌన్: జిల్లా ప్రజలకు కలెక్టర్ టీఎస్ చేతన్, ఎస్పీ రత్న విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. ఈమేరకు వేర్వేరుగా ప్రకటనలు విడుదల చేశారు. అందరిపై అమ్మవారి ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు. దుష్టశక్తులపై దైవశక్తి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకొనే విజయదశమిని ఆనందంగా జరుపుకోవాలన్నారు. అనుకున్న కార్యాలన్నీ పూర్తయి ప్రజలందరూ సుఖ సంతోషాలు జీవించాలని దుర్గామాతను ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఫుట్‌బాల్ టోర్నీ విజేతగా జిల్లా జట్టు



ట్రోఫీని అందుకుంటున్న జిల్లా సీనియర్ పురుషుల ఫుట్‌బాల్ జట్టు

హిందూపురం టౌన్: రాష్ట్రస్థాయి సీనియర్ పురుషుల ఫుట్‌బాల్ పోటీల్లో జిల్లా జట్టు చాంపియన్‌గా నిలిచింది. ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 8 నుంచి 11వ తేదీ వరకు రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలు గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరిగాయి. ఈ పోటీల్లో రాష్ట్ర నలుమూలల నుంచి 25 జట్లు పాల్గొన్నాయి. సెమీఫైనల్‌లో జిల్లా జట్టు విశాఖపట్నంతో తలపడి విజయం సాధించి ఫైనల్ చేరింది. శుక్రవారం జరిగిన ఫైనల్ పోరులో కర్నూలు జట్టుతో జిల్లా జట్టు తలపడింది. మ్యాచ్ సమయం ముగిసేనాటికి ఇరు జట్లు చెరో గోల్ చేయడంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. అనంతరం ఇరు జట్లకు ఐదు చొప్పున పెనాల్టీ కిక్స్ ఇచ్చారు. ఇందులో జిల్లా జట్టు మూడు గోల్స్ చేయగా, కర్నూలు జట్టు రెండు గోల్స్ చేసింది. ఒక్క గోల్ తేడాతో జిల్లా జట్టు ఫుట్‌బాల్ టోర్నీ విజేతగా నిలిచింది. జట్టుకు ముఖ్య అతిథులు ట్రోఫీ అందజేశారు. రాష్ట్రస్థాయి పోటీల్లో విజేతగా నిలిచిన జిల్లా జట్టు క్రీడాకారులను, కోచ్ బీకే మహమ్మద్ సలీమ్, మేనేజర్ ఇర్షాద్ అలీను ఫుట్‌బాల్ సంఘం జిల్లా అధ్యక్షుడు జేపీ అనిల్ కుమార్ అభినందించారు.

బెలగావి-మణగూరు ఎక్స్‌ప్రెస్ రైళ్ల పునరుద్ధరణ

గుంతకల్లు: బెలగావి-మణగూరు మధ్య నడిచే ఎక్స్‌ప్రెస్ రైళ్లను పునరుద్ధరించినట్లు రైల్వే డివిజన్ కార్యాలయ వర్గాలు తెలిపాయి. బెలగావి నుంచి ఆది, బుధ, శని, మంగళవారాల్లో నడిచే మణగూరు (07335) ఎక్స్‌ప్రెస్ రైలు ఈ నెల 16 నుంచి ప్రారంభమవుతుంది. ఆ రోజుల్లో మధ్యాహ్నం 12.30 గంటలకు బెలగావి నుంచి బయల్దేరి గుంతకల్లు జంక్షన్‌కు రాత్రి 9.20 గంటలకు చేరుకుంటుంది. ఇక్కడ నుంచి 9.40 గంటలకు బయలుదేరి ఆదోని, మంత్రాలయం, రాయచూర్, వికారాబాద్ మీదుగా సికింద్రాబాద్‌కు మరుసటి రోజు ఉదయం 5.25 గంటలకు చేరుతుంది. అక్కడ నుంచి మణగూరుకు మధ్యాహ్నం 12.50 గంటలకు చేరుతుంది. సోమ, గురు, ఆది, బుధవారాల్లో నడిచే రైలు (07336) ఈ నెల 17న మధ్యాహ్నం 3.40 గంటలకు మణగూరు జంక్షన్‌కు బయలుదేరి రాత్రి 10.10 గంటలకు సికింద్రాబాద్ జంక్షన్‌కు చేరుతుంది. అక్కడ నుంచి రాత్రి 10.20 గంటలకు బయలుదేరి వికారాబాద్, రాయచూర్, మంత్రాలయం, ఆదోని మీదుగా గుంతకల్లు జంక్షన్‌కు మరుసటి రోజు ఉదయం 6.20 గంటలకు చేరుతుంది. ఇక్కడ నుంచి 6.30 గంటలకు బయలుదేరి బెలగావి జంక్షన్‌కు సాయంత్రం 4.00 గంటలకు చేరుతుంది.

టీబీ డ్యాంలో 16 గేట్లు ఎత్తివేత



బొమ్మనహాళ్: తుంగభద్ర జలాశయానికి వరద నీరు కొనసాగుతుంది. శుక్రవారం సాయంత్రం డ్యాంలో 101.539 టీఎంసీలకు నీటి నిల్వ చేరింది. డ్యామ్ పూర్తిగా నిండటంతో శుక్రవారం ఉదయం 16 క్రస్ట్ గేట్లు అడుగున్నర మేర పైకి ఎత్తి 35,616 క్యూసెక్కుల నీటిని నదికి వదులుతున్నారు.

దసరా వైభవం.. ఆధ్యాత్మిక సౌరభం

సకల సృష్టి, స్థితి, లయ కారిణిగా ప్రాకృత్రిక చైతన్య స్వరూపమైన అమ్మవారి ఆరాధనే దసరా పండుగ. హిందువులంతా నిష్టగా జరుపుకునే వేడుక. అమ్మవారిని ఆరాధించడం.. ఆమెను శక్తి స్వరూపిణిగా భావించడం .. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక విజయదశమి. ఇందులో భాగంగానే జిల్లా వ్యాప్తంగా దసరా ఉత్సవాలను వైభవంగా జరుపుకునేందుకు ప్రజలు సిద్ధమయ్యారు.



ధర్మవరం: మహిషాసురమర్దినిగా దర్శనమిస్తున్న చౌడేశ్వరీదేవి



కదిరి: వేంకటేశ్వరుని అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి



హిందూపురం: మహిషాసురమర్దినిగా చౌడేశ్వరి

- జిల్లాలకు విజయదశమి శోభ
- కిటకిటలాడిన మార్కెట్లు, దుస్తుల దుకాణాలు
- వాహనాలకు ఘనంగా ఆయుధపూజ
- నేడు శిల్పారామంలో విజయదశమి వేడుకలు



మడకశిర : కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న పూల మార్కెట్

పుట్టపర్తి టౌన్: శరన్నవరాత్రులు అంబరాన్నంటుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆలయాల్లో శుక్రవారం వివిధ రూపాల్లో అమ్మవార్లు దర్శనం ఇచ్చారు. విజయదశమిని పురస్కరించుకొని ఆయా ప్రాంతాల్లోని ఆలయాలను ప్రత్యేకంగా ముస్తాబు చేశారు. లేపాక్షిలోని వీరభద్రస్వామి, కదిరి లక్ష్మీనృసింహస్వామి, రొళ్లలోని కొల్లాపురి మహాలక్ష్మీ, హిందూపురంలో చౌడేశ్వరీదేవి ఆలయాలను అందంగా తీర్చిదిద్దారు.

భక్తిశ్రద్ధలతో ఆయుధపూజ..

దుర్గాష్టమిని పురస్కరించుకొని ఆయుధ పూజను అన్ని చోట్లా ఘనంగా నిర్వహించారు. ముఖ్యంగా ప్రజలు తమ తమ వాహనాలను పూలతో అలంకరించి పూజలు చేశారు. వివిధ పరిశ్రమలు, యంత్ర దుకాణాలు తదితర వాటిలోనూ అర్చకుల ఆధ్వర్యంలో పూజలను జరిపించారు. నూతన వాహనాల కొనుగోలుకు కూడా ప్రజలు ఆసక్తి చూపారు.

మార్కెట్లు కళకళ..

జిల్లా వ్యాప్తంగా నవరాత్రి శోభ సంతరించుకుంది. శనివారం పండుగ నేపథ్యంలో శుక్రవారం జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లోని మార్కెట్లు, బట్టల దుకాణాలు కిటకిటలాడాయి. పూజా సామగ్రిని కొనుగోలు చేసేందుకు అందరూ తరలిరావడంతో హిందూపురం, పెనుకొండ, మడకశిర, పుట్టపర్తి, కదిరి, ధర్మవరం నియోజకవర్గ కేంద్రాల్లో సందడి నెలకొంది.

పట్నం నుంచి పల్లెకు...

రెండు మూడు రోజులుగా పట్నం, పల్లెల్లో బంధువులతో సందడి వాతవరణం కనిపిస్తోంది. ఇతర ప్రాంతాల్లో చదువుతున్నవారు, ఉద్యోగ రీత్యా సిటీల్లో స్థిరపడిన వారు అధిక సంఖ్యలో దసరా సందర్భంగా స్వంత ఊళ్లకు చేరుకున్నారు.

నేడు దసరా సంబరాలు..

దసరా పండుగను పురష్కరించుకొని శనివారం పుట్టపర్తి పట్టణ సమీపంలో ఉన్న శిల్పారామంలో సాయంత్రం 4 గంటల నుంచి 8 గంటల వరకు దసరా సంబరాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఏఓ రమేష్‌రెడ్డి తెలిపారు.

పోలీస్ కార్యాలయంలో ఆయుధ పూజ

జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయుధ పూజను ఘనంగా నిర్వహించారు. దుర్గామాత చిత్రపటానికి ఎస్పీ రత్నతో పాటు పోలీస్ సిబ్బంది ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పోలీసులు వినియోగించే ఆయుధాలు, వాహనాలకు ఎస్పీ రత్న చేతుల మీదుగా పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ విజయకుమార్, ఎస్బీ సీఐ బాలసుబ్రహ్మణ్యంరెడ్డి, ఆర్ఐలు వళి, సీఐ సునీత, ఎస్ఐ ప్రదీప్‌కుమార్ తదితరలు పాల్గొన్నారు.






బత్తలపల్లి: విద్యుత్‌కాంతులతో మెరిసిపోతున్న కొల్లాపురమ్మ ఆలయం, వేడుకలకు ముస్తాబైన లేపాక్షి ఆలయం, బత్తలపల్లి: ఆయుధపూజను పురస్కరించుకొని వాహనాలను ప్రత్యేకంగా అలంకరించిన దృశ్యం , ఆయుధ పూజలో పాల్గొన్న ఎస్పీ రత్న

అలరించిన సంగీత కచేరీ



యజ్ఞం చేస్తున్న రుత్వికులు

ప్రశాంతి నిలయం: ప్రశాంతి నిలయంలో దసరా ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం సాయంత్రం సత్యసాయి సన్నిధిలో ప్రశాంతి విద్వాన్ మహాసభ నిర్వహించారు. విద్యావేత్త శ్రీనివాస్ దసరా పర్వదిన వేడుకలు, సత్యసాయి తత్వాలను భక్తులకు వివరించారు. అనంతరం సత్యసాయి విద్యాసంస్థల బృందావన్ క్యాంపస్‌కు చెందిన విద్యార్థులు సంగీత కచేరీ నిర్వహించారు. సత్యసాయి అవతార వైభవాన్ని చాటుతూ ఆయన ప్రేమ తత్వాన్ని చాటుతూ వారు నిర్వహించిన సంగీత కచేరీ భక్తులను మైమరపించింది. తర్వాత సత్యసాయి పూర్వపు ప్రసంగాలను వినిపించారు. అనంతరం భక్తులు సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

నేడు మహా పూర్ణాహుతి..

దసరా వేడుకల్లో భాగంగా ఈ నెల 6న ప్రశాంతి నిలయంలోని పూర్ణచంద్ర ఆడిటోరియంలో విశ్వ శాంతిని కాంక్షిస్తూ వేద పురుష సప్తాహ జ్ఞాన యజ్ఞాన్ని ప్రారంభించారు. పూర్ణచంద్ర ఆడిటోరియంలో ప్రత్యేక యజ్ఞ వేదిక వద్ద 27 మంది రుత్వికుల బృందం యజ్ఞం చేపట్టింది. శనివారం ఉదయం 7 గంటలకు పూర్ణాహుతితో కార్యక్రమం ముగియనుంది.



సంగీత కచేరి నిర్వహిస్తున్న బృందావన్ క్యాంపస్ విద్యార్థులు

పర్యాటక అభివృద్ధికి కృషి



కలెక్టర్ టీఎస్ చేతన్‌తో కళాకారులు

- దసరా సంబరాల్లో కలెక్టర్ టీఎస్.చేతన్



బాలికల నృత్య ప్రదర్శన

లేపాక్షి: జిల్లాలో పర్యాటక అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు కలెక్టర్ టీఎస్.చేతన్ తెలిపారు. శుక్రవారం రాత్రి లేపాక్షిలోని వీరభద్రస్వామి ఉత్తర ప్రవేశ ద్వారం వద్ద జిల్లా పర్యాటకశాఖ ఆధ్వర్యంలో దసరా-2024 సంబరాల ముగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ చేతన్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన లేపాక్షి, పెనుకొండ, పుట్టపర్తి, తిమ్మమ్మ మర్రిమానుతో పాటు మడకశిర ప్రాంతంలోని హేమావతి, రత్నగిరి కోట, కదిరి లక్ష్మీనరసింహస్వామి దేవాలయం, గోరంట్లలోని మాధవరాయ ఆలయం, కటారుపల్లి యోగి వేమన సమాధి తదితర పర్యటక కేంద్రాలు మన జిల్లాలో ఉండటం ఎంతో అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఈ ప్రాంతాలు మన జిల్లాకు గర్వకారణంగా భావితరాలకు తలమానికంగా నిలుస్తున్నాయని తెలిపారు. లేపాక్షి ప్రాంతం దేశవ్యాప్తంగా ఉన్న పర్యాటకులను ఎంతగానో ఆకర్షిస్తోందన్నారు. ఈ ప్రాంతాన్ని మరింతగా అభివృద్ధి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. టూరిజం జిల్లా అధికారి జయకుమార్‌బాబు, మేనేజర్ ప్రతాపరెడ్డి, తహసీల్దార్ సౌజన్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

87 షాపులు.. 1,460 దరఖాస్తులు

- ముగిసిన మద్యం దరఖాస్తుల గడువు
- ఎల్లుండి లక్కీ డ్రా



ఎక్సైజ్ స్టేషన్	షాపు నంబర్లు	దరఖాస్తులు
ధర్మవరం	1 నుంచి 20	219
సీకే పల్లి	21 నుంచి 25	28
పెనుకొండ	26 నుంచి 38	244
పుట్టపర్తి	39 నుంచి 48	328
హిందూపురం	49 నుంచి 59	224
కదిరి	60 నుంచి 71	120
తనకల్లు	72 నుంచి 77	136
మడకశిర	78 నుంచి 87	161

సాక్షి, పుట్టపర్తి: మద్యం దుకాణాల దరఖాస్తు గడువు శుక్రవారం సాయంత్రంతో ముగిసింది. జిల్లా వ్యాప్తంగా 87 షాపులకు 1,460 దరఖాస్తులు వచ్చాయి. మద్యం దుకాణాలను సొంతం చేసుకోవడంలో టీడీపీ నేతల హవా స్పష్టంగా కనిపిస్తోంది. అక్రమమార్గంలో ఆదాయం ఆర్జించాలనే ఉద్దేశంతో లాటరీ పద్ధతి ఉన్నప్పటికీ ఎవరినీ దరఖాస్తు చేయనీయకుండా అడుగడుగునా అడ్డుకున్నారు. దరఖాస్తులు చేసిన వారిలో 80 శాతం మంది అధికార పార్టీ అనుయాయులే ఉండటం గమనార్హం. మిగతా 20 శాతం మంది రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా బరిలో దిగారు. అయితే వారందరికీ ఇప్పటికే వార్నింగ్‌లు వెళ్లినట్లు తెలిసింది. ఒకవేళ లాటరీలో దుకాణం దక్కించుకున్నా వదిలి వెళ్లాల్సిందేనంటూ బెదిరింపులకు దిగినట్లు సమాచారం.

ఆరంభం నుంచే బెదిరింపులు..

మద్యం దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైన రోజు నుంచి టీడీపీ నేతలు బెదిరింపులు మొదలుపెట్టారు. ఎవరు దరఖాస్తు చేసినా ఖబడ్దార్ అంటూ ఫోన్లలో వార్నింగ్ ఇచ్చారు. దీంతో చాలామంది ఔత్సాహికులు వెనక్కి తగ్గారు. కాగా ఆన్‌లైన్ విధానం అందుబాటులో ఉండటంతో ఇతర ప్రాంతాల నుంచి దరఖాస్తులు చేశారు. అయితే లాటరీలో ఎవరు దక్కించుకున్నా తమకు ఇవ్వాల్సిందేనని హుకుం జారీ చేశారు. ఇలాంటి ఘటనలు హిందూపురం, కదిరి, మడకశిరలో ఎక్కువగా వెలుగు చూశాయి. కొత్తచెరువులో భారీగా దరఖాస్తులు వచ్చినప్పటికీ కమ్మ సామాజిక వర్గానిదే పెత్తనం సాగుతున్నట్లు తెలిసింది. ధర్మవరం, పెనుకొండలో మంత్రి అనుచరులు నెలవారీ మామూళ్లు, పర్సెంటేజీల రూపంలో మాట్లాడుకున్నట్లు సమాచారం.

'తమ్ముళ్ల' కనుసన్నల్లోనే..

జిల్లా వ్యాప్తంగా మద్యం దుకాణాలు టెండర్ వేసే ప్రక్రియ మొత్తం ఎమ్మెల్యే, ఎంపీ, మంత్రులు, వారి పీఏలు, అనుచరుల కనుసన్నల్లోనే జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రతి దుకాణం తమకు.. తమ అనుచరులు.. తాము చెప్పిన వారికే దక్కే విధంగా టీడీపీ నేతలు ముందస్తు ప్లాన్ చేశారు. దీంతో ఆరంభం నుంచి దరఖాస్తుల ప్రక్రియ మందకొడిగా సాగింది.

చివరి రోజు భారీగా దరఖాస్తులు..

నూతనంగా ఏర్పాటు కానున్న ప్రైవేటు మద్యం దుకాణాలకు దక్కించుకొనేందుకు దరఖాస్తుల ప్రక్రియ శుక్రవారంతో ముగిసింది. జిల్లాలోని 87 దుకాణాలకు సంబంధించి మొత్తం 1,460 దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు.

14న లక్కీ డ్రా..

జిల్లాకు సంబంధించి పుట్టపర్తిలోని సాయి ఆరామంలో కలెక్టర్ చేతన్ అధ్యక్షతన ఈనెల 14న లాటరీ విధానంలో దుకాణాలకు అనుమతులు మంజూరు చేస్తారు. 15న పాత పాలసీ రద్దు చేసి కొత్త పాలసీ ప్రారంభిస్తారు. ఈనెల 16వ తేదీ నుంచి కొత్త విధానం అమలు కానుంది.

తుపాను ప్రభావంతో జిల్లాలో వర్షం

- 20 మండలాల్లో కురిసిన వాన
- రొద్దంలో అత్యధికంగా 66.2 మి.మీటర్లుగా నమోదు



పుట్టపర్తి అర్బన్: తుపాను ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకూ 20 మండలాల్లో వర్షం కురిసినట్లు వాతావరణశాఖ అధికారులు తెలిపారు. జిల్లాలోని రొద్దం మండలంలో 66.2 మి.మీటర్లు, అమరాపురంలో 65.4 , రొళ్లలో 60.4, గుడిబండలో 41 , హిందూపురంలో 38.4, అమడగూరులో 32.7, చిలమత్తూరులో 32.4, సోమందేపల్లిలో 30.8 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. అలాగే లేపాక్షిలో 24.6 మి.మీటర్లు, పరిగిలో 20.4, పెనుకొండలో 18.2, మడకశిరలో 15.2, నల్లమాడలో 7, రామగిరిలో 6.8, అగళిలో 6.6, కనగానపల్లిలో 5.2, కొత్తచెరువులో 5, ముదిగుబ్బలో 3.8, బత్తలపల్లిలో 2.2, పుట్టపర్తిలో 1.8 మి.మీటర్ల వర్షం కురిసింది. తుపాను ప్రభావంతో మరో మూడు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ అధికారులు తెలిపారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

వచ్చే మూడు రోజుల్లో జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేసిందని కలెక్టర్ చేతన్ తెలిపారు. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. 14, 15, 16 తేదీల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

క్లుప్తంగా

లారీని ఢీ కొన్న '108'


ప్రమాదానికి గురైన 108 అంబులెన్స్

బత్తలపల్లి: రోడ్డు పక్కన నిలిపి ఉన్న లారీని 108 అంబులెన్స్ ఢీకొన్న ఘటనలో ఈఎంటీ, పైలెట్ గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు... ముదిగుబ్బ మండలానికి చెందిన వారిని అత్యవసర వైద్యం కోసం గురువారం రాత్రి అనంతపురంలోని సర్వజనాస్పత్రికి 108 అంబులెన్స్‌లో తరలించారు. అనంతరం శుక్రవారం వేకువజామున ఒంటి గంట ప్రాంతంలో తిరుగు ప్రయాణమైన అంబులెన్స్ సిబ్బంది.... .బత్తలపల్లి మండలం తంబాపురం క్రాస్ సమీపంలోకి రాగానే రోడ్డు పక్కన ఆపి ఉన్న లారీని (టైరు పంచర్ కావడంతో మార్చుకుంటున్నారు) గమనించకుండా ఢీ కొన్నారు. ప్రమాదంలో పైలట్ బాల ఓబులేసు, ఈఎంటీ రవికుమార్ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే బత్తలపల్లి 108 వాహనంలో క్షతగాత్రులను బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. ఆర్డీటీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులతో ఘటనపై ఆరా తీసి, కేసు నమోదు చేశారు.

ఉపాధ్యాయుడిపై చీటింగ్ కేసు నమోదు

తాడిపత్రి అర్బన్: చిట్టీల పేరుతో మోసం చేసిన ఉపాధ్యాయుడు నిరంజన్‌పై శుక్రవారం అర్బన్ పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేశారు. ఈ మేరకు సీఐ సాయిప్రసాద్ తెలిపారు. తాడిపత్రిలో నివాసముంటున్న మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ (టీడీపీ) బి.వెంకటలక్ష్మి భర్త నిరంజన్ ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ.. మరోవైపు చిట్టీల వ్యాపారం కొనసాగించాడు. ఈ క్రమంలో మూడు నెలల క్రితం అందరికీ కుచ్చుటోపి పెట్టి అజ్ఞాతంలోకి వెళ్లాడు. దీంతో బాధితుల్లో ఒకరైన జయగనగర్ కాలనీ నివాసి ఎం.సూర్యనారాయణ పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. రూ.40లక్షలను ఇవ్వకుండా మోసం చేసి నిరంజన్ ఊరు విడిచి వెళ్లాడంటూ వాపోయారు. దీంతో నిరంజన్‌పై పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

పెయ్య దూడలతో ఆర్థికాభివృద్ధి

- 2,400 ఆవులకు కృత్రిమ గర్భదారణ
- అద్భుత ఫలితాలిస్తున్న కృత్రిమ గర్భధారణ పథకం
- జిల్లాలో 2.10 లక్షల మంది పాడి రైతులకు లబ్ధి

పుట్టపర్తి అర్బన్: జిల్లాలో పాడి రైతుల ఆర్థికాభివృద్ధికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకున్న చర్యలు సత్ఫలితాలను ఇస్తోంది. మేలు జాతి పశువుల వీర్య నాళికలతో ఆవులు, గేదెల్లో కృత్రిమ గర్భధారణ చేయిస్తూ కేవలం పెయ్య దూడలే జన్మించేలా తీసుకున్న చొరవతో జిల్లాలో పాడి క్రమేణ అభివృద్ధి చెందుతోంది.

రాష్ట్రీయ గోకుల మిషన్ సౌజన్యంతో...

వ్యవసాయానికి ప్రత్యామ్నాయంగా పాడి పోషణపై దృష్టి సారించిన రైతుల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా అప్పట్లో జగన్ సర్కార్ రూ.లక్షలు వెచ్చించింది. రాష్ట్రీయ గోకుల మిషన్ సౌజన్యంతో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పెయ్య దూడల సంతానోత్పత్తికి చర్యలు చేపట్టింది. జిల్లాలో ఒకటిన్నర ఏడాది క్రితం ప్రారంభమైన ఈ పథకంలో ఇప్పటికే పలువురు రైతుల ఇంట పెయ్య దూడల సందడి నెలకొంది. సుమారు 2,400 పాడి ఆవులకు చేసిన కృత్రిమ గర్భాధారణ ప్రక్రియ ఫలితంగా ఇప్పటికే 780 పెయ్య దూడలు జన్మించినట్లు అధికారిక రికార్డులు స్పష్టం చేస్తున్నాయి.


అమడగూరులో పాడి రైతులకు అవగాహన కల్పిస్తున్న పశువైద్యాధికారులు (ఫైల్)

రాయితీతో వీర్య నాళికల అందజేత..

లింగ నిర్ధారణ వీర్య నాళికలతో కృత్రిమ గర్భధారణకు ఒక్కో పశువుకు రూ.1,350 ఖర్చవుతుంది. అయితే రైతు వాటాగా కేవలం రూ.500 చెల్లిస్తే రూ.850 సబ్సిడీని ప్రభుత్వం అందిస్తూ వచ్చింది. ఈ క్రమంలో వీర్య నాళికలను రెండు డోసులుగా పశువులకు అందిస్తారు. ఈ వీర్యంతో 90 శాతానికి పైగా కచ్చితత్వంతో పెయ్య దూడలే జన్మిస్తున్నాయి. ఒక డోసు ఫెయిల్ అయి గర్భం దాల్చక పోతే రెండో డోసు ఉచితంగా అందజేస్తారు. పాల దిగుబడి పెంచే ముర్రా, గిర్, జెర్సీ, హెచ్ఎఫ్ జెర్సీ, సాహివాల్ తదితర మేలు జాతి రకాల వీర్యాన్ని అందుబాటులోకి తెచ్చారు. ఎవరైనా రైతులు ఈ పథకం ద్వారా లబ్ధి పొందాలనుకుంటే స్థానిక సచివాలయాల్లోని వెటర్నరీ అసిస్టెంట్లను సంప్రదించాల్సి ఉంటుంది.

మంచి పథకం



నేను సుమారు 12 ఏళ్లుగా పాడి పశువుల పెంపకంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నా. ఇదే మాకు జీవనాధారం. పెయ్య దూడలు పుడితే మహాలక్ష్మి పుట్టినట్లేనని సంబరపడేవాళ్లం. ఈ పథకం ద్వారా ఇప్పటికే మా ఇంట్లోని రెండు ఆవులు పెయ్య దూడలకు జన్మనిచ్చాయి.. ప్రతి పాడి రైతు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకుంటే మంచి ఆదాయం ఉంటుంది. – సుధాకర్, పాడి రైతు, ప్రశాంతిగ్రామం

అవగాహన కల్పిస్తున్నాం



పశువుల్లో కృత్రిమ గర్భధారణ పథకంపై పాడి రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ఇప్పుడిప్పుడే పథకం ఫలితాలు దక్కుతున్నాయి. ఇప్పటి వరకూ 2,400 పశువులకు వీర్యం అందించాం. సుమారు 780 పెయ్య దూడలు జన్మించాయి. అన్నీ పెయ్య దూడలే పుట్టడం చాలా సంతోషదాయకం. రైతులు సద్వినియోగం చేసుకోవాలి. – శుభదాస్, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి

చేనేత కార్మికుడి ఆత్మహత్య


రంగ (ఫైల్)

ధర్మవరం అర్బన్: అప్పులు తీర్చే మార్గం కానరాక ఓ చేనేత కార్మికుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. ధర్మవరంలోని రాంనగర్‌కు చెందిన ఉడుముల రంగ (45) మగ్గం నేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. తన చేనేత ఉత్పత్తులకు గిట్టుబాటు ధర లేకపోవడంతో పాటు ముడి సరుకుల ధరలు విపరీతంగా పెరగడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయాడు. ఈ క్రమంలోనే కుటుంబ పోషణ, పిల్లల చదువులు, ముడి సరుకులకు అప్పులు చేశాడు. వీటికి వడ్డీల భారం పెరిగి రూ.5 లక్షలకు చేరుకున్నాయి. ఇటీవల తమ డబ్బు తిరిగి చెల్లించాలంటూ వడ్డీ వ్యాపారుల నుంచి ఒత్తిళ్లు తీవ్రం కావడంతో తట్టుకోలేక పోయాడు. అప్పులు తీర్చే మార్గం కానరాక శుక్రవారం తెల్లవారుజామున ఇంట్లోనే మగ్గం వద్ద ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయం నిద్రలేచిన భార్య... ఉరికి విగత జీవిగా వేలాడుతున్న భర్తను చూసి బోరున విలపించింది. విషయం తెలుసుకున్న టూటౌన్ పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుని భార్య రేవతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. ఆయనకు కుమార్తె పావని, కుమారుడు జశ్వంత్ ఉన్నారు. కాగా, రంగ ఆత్మహత్య విషయం తెలుసుకున్న పలువురు బీజేపీ, టీడీపీ నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందించారు.

హనుమేష్‌నగర్‌లో చోరీ


వేలి ముద్రలు సేకరిస్తున్న నిపుణుల బృందం

గుంతకల్లు టౌన్: స్థానిక హనుమేష్‌నగర్‌లో నివాసముంటున్న రంగనాయకులు ఇంట్లో చోరీ జరిగింది. ఇంటి తాళాలు బద్దలు కొట్టి లోపలకు చొరబడిన దుండగులు బీరువాలో భద్రపరిచిన 5 తులాల బంగారు నగలు, రూ.30 వేల నగదు అపహరించినట్లు వన్‌టౌన్ సీఐ బి.మనోహర్ తెలిపారు. స్థానిక పద్మావతి నర్సింగ్‌హోమ్ వద్ద మొదటి అంతస్తులో అద్దెకు ఉంటున్న రైతు రంగనాయకులు కాలినొప్పి కారణంగా మంగళవారం ఇంటికి తాళం వేసి వైద్యపరీక్షల నిమిత్తం అనంతపురానికి వెళ్లారు. అక్కడి వైద్యుల సూచన మేరకు ఆస్పత్రిలో అడ్మిట్ అయ్యారు. శుక్రవారం ఉదయం రంగనాయకులు ఇంటి తాళాలు బద్ధలైన విషయాన్ని గమనించిన ఇంటి యజమాని సమాచారంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

'పురం' పీఠంపై 'పచ్చ'కన్ను

- మున్సిపాలిటీని దక్కించుకునేలా కుట్రలు
- ఇప్పటికే తొమ్మిది మంది వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లను చేర్చుకున్న వైనం
- ఇందులో నలుగురు తిరిగి సొంత గూటికి
- కుట్ర విఫలం కావడంతో బెదిరింపుల పర్వం

హిందూపురం: మెజారిటీ లేకపోయినా హిందూపురం మున్సిపాలిటీని దక్కించుకునేందుకు టీడీపీ దౌర్జన్యాలకు తెర తీసింది. స్థానిక మున్సిపాలిటీలో 38 మంది కౌన్సిలర్లు ఉండగా ఇందులో వైఎస్సార్‌సీపీకి 30 మంది, టీడీపీకి ఆరుగురు, ఎంఐఎం 1, బీజేపీ 1 చొప్పున కౌన్సిలర్లు ఉన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత హిందూపురం మున్సిపాలిటీని ఎలాగైనా దక్కించుకోవాలనే కుట్రలను టీడీపీ వేగవంతం చేస్తూ వచ్చింది. ఈ క్రమంలో ప్రలోభాలకు లోనైన చైర్‌పర్సన్ ఇంద్రజ తనతో పాటు మరో ఎనిమిది మందిని కలుపుకుని కొంత కాలం క్రితం టీడీపీలో చేరారు. అయితే కుట్ర బహిర్గతం కావడంతో నలుగురు కౌన్సిలర్లు తిరిగి వైఎస్సార్‌సీపీ గూటికి చేరుకున్నారు.

నోటీసులు జారీ చేస్తూ...

కౌన్సిలర్ల సంఖ్యా బలం తగ్గినా... మెజారిటీ సభ్యులున్న వైఎస్సార్‌సీపీని అధికారం నుంచి తప్పించేందుకు కొత్త ఎత్తుగడలకు టీడీపీ నాయకులు తెరదీశారు. ఇందులో భాగంగా బెదిరింపులు ఊపందుకున్నాయి. 30వ వార్డు కౌన్సిలర్ ఆసీఫ్ ఉల్లా ఇంటి వెనుక ఉన్న ఇరిగేషన్ కాలువ నుంచి విషపురుగులు రాకుండా బండలు నాటుకున్నారు. వాస్తవానికి ఈ పని ఇరిగేషన్ శాఖ చేయాల్సి ఉన్నా... ఆ శాఖ అధికారులు ముందుకు రాకపోవడంతో సొంత డబ్బును వెచ్చించి కాలువ సమీపంలో నివాసముంటున్న ఇంటి యజమానులు బండలు పాతారు. దీనిని సాకుగా చూపిస్తూ మున్సిపాలిటీ స్థలం ఆక్రమించారంటూ నోటీసులు జారీ చేయించారు. ఈ ప్రక్రియలో బెదిరింపు అనేది కంటికి కనిపించకుండా ఉండేందుకు ఆసీఫ్ ఉల్లాతో పాటు ఆ ఇంటి పక్కనే ఉన్న మరో 18 మందికీ నోటీసులు అందించేలా పావులు కదిపారు. కాలువపై ఆసీఫ్ ఉల్లా ఎలాంటి నిర్మాణాలు చేయలేదు. తన ఇంటి సరిహద్దుకు కాలువకు మధ్యలో విషపురుగులు లోపలకు చొరబడకుండా బండలు నాటి మొక్కల పెంచుతున్నారు. అలాగే 34వ వార్డు కౌన్సిలర్ నాగమణి నిబంధనలకు విరుద్ధంగా తన ఇంటిపై చిన్న గది కట్టుకున్నారంటూ నోటీసులు ఇచ్చారు. పట్టణంలో వందలాది మంది టీడీపీ నేతలు, కార్యకర్తలు ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణాలు చేసినా, ప్రభుత్వ స్థలాలను కబ్జా చేసినా పట్టించుకోని అధికారులు... పచ్చనేతల ఒత్తిళ్లకు తలొగ్గి వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లను లక్ష్యంగా చేసుకుని నోటీసులు జారీ చేస్తుండడంపై స్థానికులు పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్


పట్టుబడిన పుల్లానాయుడు

మదనపల్లి : చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర నేరస్తుడిని అరెస్ట్ చేసినట్లు మదనపల్లి తాలూకా సీఐ కళావెంకటరమణ తెలిపారు. వివరాలను శుక్రవారం ఆయన వెల్లడించారు. మదనపల్లి మండలం కొత్తవారిపల్లె పంచాయతీ పూలవాండ్లపల్లిలో నివాసముంటున్న ఎస్.రెడ్డిమోహన్ ఇంట్లో సెప్టెంబర్ 26న రాత్రి గుర్తు తెలియని వ్యక్తి చొరబడి 8 గ్రాముల బంగారు, రూ.17వేల నగదు అపహరించుకెళ్లాడు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు శుక్రవారం మదనపల్లి మండలం తట్టివారిపల్లె సర్కిల్‌లో అనుమానాస్పదంగా తచ్చాడుతున్న అనంతపురం రూరల్ మండలం మన్నీల గ్రామానికి చెందిన లక్ష్మమ్మ కుమారుడు జె.పుల్లానాయుడుని అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారణ చేశారు. దీంతో నేరం రుజువైంది. నిందితుడి నుంచి 30 గ్రాముల బంగారు నగలు స్వాధీనం చేసుకున్నారు. పుల్లానాయుడు ప్రస్తుతం తిరుపతి తీర్థకట్టవీధిలో నివాసం ఉంటున్నాడు. చోరీలతో పాటు పలు నేరాలకు పాల్పడేవాడు. మదనపల్లి వన్‌టౌన్ పరిధిలో వడ్డిపల్లె అమ్మవారి ఆలయంలో చోరీతో పాటు తాలూకా పరిధిలో చైన్‌స్నాచింగ్ కేసులో నిందితుడిగా ఉన్నాడు. అలాగే కర్నూలు, ఆత్మకూరు, బళ్లారి, ప్రొద్దుటూరు, మార్కాపురం, డోన్‌తో పాటు తెలంగాణలోని పలు పీఎస్‌ల పరిధిలో 17 కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. నిందితుడిపై కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

మహిళ హత్య కేసులో వీడిన మిస్టరీ

- నిందితుడి అరెస్ట్
- మద్యం గ్లాసులో నీటికి బదులు మూత్రం కలిపి ఇచ్చిందనే అక్కసుతో హత్య



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి టౌన్: నాలుగు రోజుల క్రితం అమడగూరు మండలం మహమ్మదాబాద్ గ్రామ సమీపంలో చోటు చేసుకున్న ఒంటరి మహిళ హత్య కేసులో మిస్టరీని పోలీసులు ఛేదించారు. పాత కక్షల నేపథ్యంలో ఆమెను హతమార్చిన నిందితుడిని అరెస్ట్ చేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుడి వివరాలను పుట్టపర్తి, కదిరి డీఎస్పీలు విజయకుమార్, శివనారాయణతో కలసి ఎస్పీ రత్న వెల్లడించారు. అమడుగూరు మండలం మహమ్మదాబాద్ క్రాస్ సమీపంలో ఉన్న ఏఎస్‌ఐ కృష్ణమూర్తి మామిడి తోటలో పెనుకొండకు చెందిన బోయ రామలక్ష్మి (53) తోటమాలిగా పని చేస్తుండేది. కదిరిలో బేల్దారి పనులతో జీవనం సాగిస్తున్న ఆమె కుమారుడు పురుషోత్తం రెండు రోజులుగా తన తల్లి ఫోన్ కాల్‌కు స్పందించక పోవడంతో అనుమానం వచ్చి ఈ నెల 6న తోట వద్దకెళ్లి పరిశీలించాడు. దీంతో ఆమె హత్య ఉదంతం వెలుగు చూసింది. సమాచారం అందుకున్న పోలీసులు... పురుషోత్తం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. హతురాలి సెల్ ఫోన్ డేటా ఆధారంగా కీలక సమాచారాన్ని పసిగట్టిన పోలీసులు.. ఓడీసీ మండలం వేమారెడ్డిపల్లికి చెందిన ఆంజనేయులను అనుమానంతో అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారణ చేశారు. దీంతో అసలు విషయం వెలుగు చూసింది. ఆంజనేయులు గతంలో అదే తోటలో తోటమాలిగా పనిచేసేవాడు. ఈ క్రమంలోనే రామలక్ష్మితో ఉన్న పరిచయం కారణంగా అప్పుడప్పుడు తోటకు వచ్చి వెళ్లేవాడు. ఈ నెల 6న రాత్రి 8 గంటల సమయంలో తోటకు చేరుకున్న ఆంజనేయులు అప్పటికే తనతో పాటు తెచ్చుకున్న మద్యం బాటిల్ రామలక్ష్మి చేతికిచ్చి నీళ్లు కలిపి ఇవ్వాలన్నాడు. ఆమె పక్కకు పోయి మందులో తన మూత్రం కలిపి ఇచ్చింది. ఇది గమనించిన ఆంజనేయులు ఆమెతో గొడవపడ్డాడు. మాటామాట పెరగడంతో చెలిక పారతో ఆమె తల, ముక్కుపై దాడి చేసి హతమార్చి రేకుల షెడ్డులోని మంచం మీద పడేసి వెళ్లిపోయాడు. నేరాన్ని ఆంజనేయులు అంగీకరించడంతో శుక్రవారం మధ్యాహ్నం అరెస్ట్ చూపించి న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. నిందితుడి అరెస్ట్‌లో చొరవ చూపిన నల్లమాడ ఇన్‌చార్జ్ సీఐ సునీత, ఎస్ఐ వెంకటనారాయణ, సిబ్బందిని ఎస్పీ రత్న అభినందించి, రివార్డులు అందజేశారు.

నెట్టికంటుడిని దర్శించుకున్న కరీంనగర్ జిల్లా జడ్జి


జడ్జి ప్రతిమ దంపతులకు తీర్థప్రసాదాలను అందజేస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: తెలంగాణలోని కరీంనగర్ జిల్లా జడ్జి ప్రతిమ దంపతులు శుక్రవారం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారికి ఆలయ మర్యాదలతో అర్చకులు స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం స్వామి తీర్థ ప్రసాదాలు, శేష వస్త్రాలను అందజేశారు.

కూడేరులో చిరుత సంచారం

కూడేరు: మండలంలోని అరవకూరు – కూడేరు గ్రామాల మధ్య శుక్రవారం ఓ చిరుత సంచరించింది. జాతీయ రహదారికి కేవలం 2 కిలోమీటర్ల దూరంలో ఉన్న అరవకూరు పరిసరాల్లో చిరుతను గుర్తించిన పశువుల కాపరులు పెద్దగా కేకలు వేయడంతో గుట్టల్లోకి పారిపోయింది. విషయం తెలుసుకున్న స్థానికులు భయాందోళనలకు గురయ్యారు. అటవీ అధికారులు స్పందించి చిరుతను బంధించాలని కోరారు.

విద్యను ప్రైవేటీకరణ చేయడమే 'కూటమి' లక్ష్యం

అనంతపురం ఎడ్యుకేషన్: రాష్ట్రంలో విద్యను ప్రైవేటీకరణ చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని వైఎస్సార్ విద్యార్థి విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి చంద్రశేఖర్ యాదవ్ మండిపడ్డారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్ చదువుతున్న విద్యార్థులకు నీట్, ఐఐటీ శిక్షణ ఇచ్చే బాధ్యతను నారాయణ విద్యాసంస్థలకు అప్పగించడమే ఇందుకు ఉదాహరణ అన్నారు. మంత్రి నారాయణకు ప్రభుత్వ విద్యను తాకట్టు పెట్టే ఆలోచనలో ప్రభుత్వం ఉందన్నారు. కూటమి ప్రభుత్వం ప్రభుత్వ విద్యను ప్రోత్సహించాలనుకుంటే ప్రభుత్వ కళాశాలల్లో నిష్ణాతులైన అధ్యాపకులతో శిక్షణ ఇప్పించాలని సూచించారు. అలా కాకుండా మంత్రికి చెందిన నారాయణ విద్యా సంస్థలకు అప్పగించడం వెనుక అంతర్యమేమిటని ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో 'నాడు–నేడు' ద్వారా పేద విద్యార్థులు చదువుకున్న పాఠశాలలు, కళాశాలల రూపురేఖలు మారిపోయాయన్నారు. అమ్మఒడి స్థానంలో ఇస్తామన్న తల్లికి వందనం ఏమైందో మంత్రి నారా లోకేష్ చెప్పాలని డిమాండ్ చేశారు.

పాడిరైతులకు 'అమూల్' దసరా బోనస్

- వరుసగా నాలుగో ఏడాది చెల్లించిన అమూల్ డెయిరీ

కదిరి అర్బన్: అమూల్ డెయిరీకి పాలుపోసిన పాడి రైతులకు దసరా సందర్భంగా బోనస్‌ను ఆ సంస్థ చెల్లించింది. రూ.3 కోట్లను పాడి రైతుల ఖాతాల్లో జమచేసినట్లు శుక్రవారం అమూల్ డెయిరీ యాజమాన్యం ఓ ప్రకటన విడుదల చేసింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పాడి రైతులకు దన్నుగా నిలుస్తూ అముల్ డెయిరీతో చేసుకున్న ఒప్పందం తెలిసిందే. ఈ క్రమంలో ఇతర ప్రైవేట్ డెయిరీల కంటే ఎక్కువ ధర చెల్లిస్తూ అమూల్ డెయిరీ యాజమాన్యం పాలను సేకరిస్తూ వచ్చింది. ఈ క్రమంలో వరుసగా నాలుగోసారి పాల ఉత్పత్తిదారులకు బోనస్ చెల్లించింది. ఏటా దసరా, దీపావళి పండుగను పురస్కరించుకుని (సెప్టెంబర్ నుంచి అక్టోబర్ వరకు) ఏడాదిలో కనీసం 183 రోజులు డెయిరీకి పాలుపోసిన రైతులకు లీటర్‌కు అర్ధరూపాయి చొప్పున బోనస్‌ను వారి ఖాతాల్లో జమ చేశారు. శ్రీసత్యసాయిజిల్లాలో 119 గ్రామాల్లో 2,103 మంది పాడిరైతులకు రూ.35.44 లక్షలు, అనంతపురం జిల్లా 98 గ్రామాల్లో 1,009 మంది పాడిరైతులకు రూ.9.79 లక్షలు చొప్పున జమ చేసినట్లు సంస్థ వెల్లడించింది. మొత్తంగా అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి, వైఎస్సార్, శ్రీసత్యసాయి, అనంతపురం జిల్లాల్లోని 18,645 మంది రైతులకు రూ.2.86 కోట్లు బోనస్‌గా ఖాతాల్లో జమ చేస్తూ దసరా నవరాత్రుల సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.

● శేషవాహనంపై చింతలరాయుడు



తాడిపత్రి అర్బన్: స్థానిక పురాతన చింతల వేంకటరమణస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం శేష వాహనంపై దేవేరులతో కలసి శ్రీవారు భక్తులకు దర్శనమిచ్చారు. శుక్రవారం ఉదయం ఆలయంలో ధ్వజారోహణంతో ఉత్సవాలకు అంకురార్పణ జరిగింది. చింతల వేంకటరమణ స్వామి ఉత్సవ మూర్తిని పల్లకీపై ఆలయ మాడ వీధుల్లో ఊరేగించారు. సాయంత్రం శేష వాహన ఉత్సవం అంగరంగ వైభవంగా సాగింది. కార్యక్రమాలను ఆలయ ఈఓ సుబ్రహ్మణ్యం పర్యవేక్షించారు.

వివాహిత అదృశ్యం

కళ్యాణదుర్గం రూరల్: పట్టణానికి చెందిన వివాహిత అదృశ్యమైంది. కళ్యాణదుర్గంలోని ఇందిరమ్మకాలనీకి చెందిన వడ్డే లక్ష్మీదేవి, శ్రీనివాస్ దంపతుల పెద్ద కుమార్తె గాయత్రికి కర్ణాటకలోని చిత్రదుర్గం జిల్లా పరశురామపురం గ్రామానికి చెందిన గంగాధర్‌తో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. గత నెల గాయత్రి తన ముగ్గురు పిల్లలను తీసుకుని పుట్టింటి నుంచి భర్త ఇంటికి బయలుదేరింది. అయితే ఆమె పరుశురామపురానికి చేరుకోలేదు. అప్పటి నుంచి ఆమె ఆచూకీ కూడా లభ్యం కాలేదు. దీంతో శుక్రవారం ఉదయం గాయత్రి కుటుంబసభ్యులు చేసిన ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి, గాలింపు చేపట్టారు.

16న అంగన్‌వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలు

రాప్తాడు రూరల్: ఐసీడీఎస్ అనంతపురం రూరల్ ప్రాజెక్ట్ పరిధిలో ఖాళీగా ఉన్న ఒక మినీ అంగన్‌వాడీ వర్కర్, 9 ఆయా పోస్టుల భర్తీకి ఈనెల 16న అనంతపురం ఆర్డీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. వివరాలను అనంతపురం రూరల్ ప్రాజెక్ట్ సీడీపీఓ ధనలక్ష్మి శుక్రవారం వెల్లడించారు. అనంతపురం రూరల్ మండల పరిధిలోని టీవీ టవర్స్ కాలనీ మినీ అంగన్‌వాడీ కార్యకర్త పోస్టు, పీసీ కాలనీ, కందుకూరు–3, ఎంటీ పల్లి, బిందెలకాలనీ, ఆత్మకూరు మండలం ముట్టాల, కుర్లపల్లి, రాప్తాడు మండలం బొమ్మేపర్తి, రాప్తాడు–3, మరూరు–3 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆయా పోస్టులు భర్తీ చేయనున్నట్లు వెల్లడించారు. ఆయా పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు 16న ఉదయం 10 గంటలకు అనంతపురంలోని ఆర్డీఓ కార్యాలయంలో హాజరుకావాలని సూచించారు. విద్యార్హతకు సంబంధించి ఒరిజినల్ సర్టిఫికెట్లు తప్పకుండా తీసుకురావాలని తెలిపారు.